గురుకులాలకు దారేది?

- రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనాలకు రోడ్డు కరువు
- రైలు పట్టాలు దాటి కాలి నడకన వెళ్లాల్సిందే..!
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


గుంతలమయమైన మట్టి రోడ్డు

ఇందల్వాయి: మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి – రాంపూర్ రోడ్డులో గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన గురుకుల పాఠశాల, కళాశాల భవనాలకు వెళ్లేందుకు సరైన రోడ్డులేక ఉపాధ్యాయులు, విద్యార్థులు, నిత్యావసర సరుకులు సరఫరా చేసే వారు ఇబ్బందులు పడుతున్నారు. రూ.2కోట్లతో కేజీబీవీ, రూ.4కోట్లతో గిరిజన గురుకుల బాలికల ఆశ్రమ కళాశాల భవనాలను నిర్మించారు. అయితే.. రోడ్డు, ప్రహరీ నిర్మించకుండా అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రం నుంచి సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న పాఠశాలకు ఆటోల్లో వెళ్లలన్నా సరైన రోడ్డు లేదు. దీంతో ఉపాధ్యాయులు ప్రమాదకరంగా ఉన్న షార్ట్‌కట్ మార్గాన్ని ఆశ్రయిస్తున్నారు. 44వ నంబరు జాతీయ రహదారి నుంచి కేవలం అర కిలోమీటరు దూరం ఉండడంతో రహదారిపై బస్సు దిగి ప్రమాదకరంగా రైలు పట్టాలు దాటుతూ కాలి నడకన పాఠశాలకు చేరుకుంటున్నారు. వర్షాకాలం పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుంది.


గుంతలమయమైన మట్టి రోడ్డు

ప్రహరీ లేక భయపడుతున్న విద్యార్థులు

కళాశాల, పాఠశాల భవనాల పనులు పూర్తయినా.. ప్రహరీ నిర్మించకపోవడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో వన్యప్రాణుల భయంతోపాటు కోతులు, సమీప గ్రామాల పశువులు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి. కోతుల బెడద తీవ్రంగా ఉందని పాఠశాల, కళాశాల భవనాల్లోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం

ఆరో తరగతి నుంచి తొమ్మిది తరగతి వరకు ఉన్న కేజీబీవీ 200 మంది విద్యార్థులు, తొమ్మిది మంది బోధన, 11 మంది బోధనేతర సిబ్బందితో కొనసాగుతున్నది. గిరిజన గురుకుల బాలికల సంక్షేమ కళాశాలలో సుమారు 540 మంది విద్యార్థులు, 30 మంది సిబ్బంది ఉన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఈ రెండు అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం ఉన్నందున.. తిర్మన్‌పల్లి-రాంపూర్ నుంచి డబుల్ రోడ్డు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇబ్బందులు పడుతున్నాం

కేజీబీవీకి చేరుకోవడానికి ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నాం. ప్రహరీ, క్రీడా మైదానం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– వర్ష, ప్రత్యేకాధికారి, కేజీబీవీ

నిధులు మంజూరు చేయాలి

గిరిజన బాలికల ఆశ్రమ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తే విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు సంతోషిస్తారు. ప్రహరీ లేకపోవడంతో కోతులు, వన్యప్రాణుల భయంతో విద్యార్థులు ఉన్నారు.

– బీ శ్రీలత, కళాశాల ప్రిన్సిపల్

ప్రత్యేకాధికారులకు తొలిసవాల్

- 7 నుంచి పల్లెల్లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 7వ తేదీ నుంచి వారం రోజులపాటు గ్రామాల్లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1న గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం గ్రామాలకు ప్రత్యేకాధికారుల (స్పెషల్ ఆఫీసర్)ను నియమించింది. 2వ తేదీన తమకు కేటాయించిన గ్రామాల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. వారు బాధ్యతలు స్వీకరించిన తర్వాత పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ మొదటి కార్యక్రమం కానుంది. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పర్యవేక్షణలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 7 నుంచి 14 వరకు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి డ్రైనేజీలను శుభ్రం చేయడంతో పాటు తాగునీటికి సంబంధించి ఇబ్బందులను పరిష్కరిస్తారు. ఈ నెల 15న అన్ని గ్రామాల్లో ముగింపు కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానిస్తారు. అయితే గ్రామ పంచాయతీల్లో నిధులు లేక ఇప్పటికే కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఉంది. నిధులు లేకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం ప్రత్యేకాధికారులకు సవాల్ అని చెప్పొచ్చు.



రోటరీ జేమ్స్ ఆధ్వర్యంలో ఎక్సలెన్స్ అవార్డులు


అవార్డులు పొందిన వారితో క్లబ్ సభ్యులు

నిజామాబాద్ సిటీ: రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో రోటరీ వృత్తిపరమైన సమర్థత(వొకేషనల్ ఎక్సలెన్స్) అవార్డులను ఆదివారం ప్రదానం చేశారు. రోటరీ జేమ్స్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు భూలోకం విజయకాంత్‌రావు మాట్లాడుతూ.. సమాజంలో ఉత్తమ సేవలు అందించిన వారిని ఎంపిక చేసి క్లబ్ తరఫున వారిని సన్మానిస్తున్నామని, అవార్డులను ప్రతి సంవత్సరం అందిస్తున్నామని తెలిపారు. అవార్డులు పొందిన వారిలో మంచాల జ్ఞానేందర్, కోటగిరి శ్రీనివాస్, కోరుడే హన్మాండ్లు ఉన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బంగారి వీరబ్రహ్మం, కోశాధికారి డాక్టర్ అనంత కులకర్ణి, ప్రాజెక్టు చైర్మన్ గౌరీ శంకర్, రావులపల్లి శ్రీనివాస్, కోటగిరి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు టి సూర్యప్రకాశ్, రంజిత్ సింగ్ ఠాకూర్, ఆర్ శ్రీనివాస్, గంజి రమేశ్, దండు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి ఎస్ఎఫ్ఐ కన్వెన్షన్


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విఘ్నేశ్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ఈ నెల 24, 25 వ తేదీల్లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని సంస్థ జిల్లా అధ్యక్షుడు రాచకొండ విఘ్నేశ్ కోరారు. తెయూ క్యాంపస్ కళాశాల వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెయూ ఇంజినీరింగ్ కాలేజ్ సెమినార్ హాల్‌లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్‌లో యూనివర్సిటీల అభివృద్ధి అంశంపై ప్రధాన చర్చ ఉంటుందన్నారు. అలాగే నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలనే అంశంపై చర్చ జరుగుతుందన్నారు. యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యారంగ సమస్యలపై పోరాటాలు, భవిష్యత్ కార్యాచరణను రూపొందించడం రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలల నుంచి విద్యార్థులు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంధ్యారెడ్డి, సభ్యులు దినేశ్, పవన్, చరణ్, శివ, చిత్రు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పని చేస్తే గుర్తింపు


దినేశ్‌ను సన్మానిస్తున్న జాతీయ బీసీ సంఘం నాయకులు

నిజామాబాద్‌నాగారం: కష్టపడి పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని, దీనికి తానే నిదర్శనమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్ అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన దినేశ్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కన్వీనర్ పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు కెంపుల నాగరాజు ఆధ్వర్యంలో నగరంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత ఆశయాలతో ముందుకు వెళ్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ అధ్యక్షుడు బొబ్బిలి నర్సయ్య, సంఘం ఉపాధ్యక్షుడు రామడుగు బాలకిషన్, రాష్ట్ర కార్యదర్శి సుజిత్‌సింగ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు స్వప్న, కార్యదర్శి లావణ్య, నగర అధ్యక్షుడు రతన్, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌రావు, శ్యాం, నాయకులు శివకుమార్, చింతకాయల రాజు, సురేశ్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు నవాతే ప్రతాప్, కృష్ణ, అంబటి శ్రీనివాస్‌గౌడ్, ఈరుముల శ్రీనివాస్, కస్తూరి కృష్ణ, చైతన్య, ఆమంద్ ప్రవీణ్, యోగేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సమావేశం వాయిదా

డిచ్‌పల్లి: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిచ్‌పల్లి మండల కేంద్రం శివారులోని జీ కన్వెన్షన్‌లో సోమవారం నిర్వహించ తలపెట్టిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు హాజరవుతారని నాయకులు తెలిపారు. అయితే సమావేశం వాయిదా పడినందున కార్యకర్తలు రావొద్దని నాయకులు సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని అమ్రాబాద్‌కు చెందిన పూల్‌సింగ్‌కు అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీను నాయక్ మాట్లాడుతూ.. పూల్‌సింగ్ ఆవుపై 2019లో చిరుత దాడి చేయడంతో మృత్యువాత పడిందని తెలిపారు. అదే సమయంలో పరిహారం కోసం అటవీశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.20వేల పరిహారం అందించి ఆదుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పూల్‌సింగ్ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపాడు.

సేవకు కేరాఫ్ స్నేహ సొసైటీ



నిజామాబాద్‌నాగారం: సేవకు కేరాఫ్ అడ్రస్ స్నేహ సొసైటీ అని అధ్యక్షుడు డాక్టర్ మహిపాల్ అన్నారు. నగరంలోని సొసైటీ కార్యాలయంలో ఆదివారం నూతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్నేహ సొసైటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపును పొందాయన్నారు. సిబ్బంది అంకిత భావంతో పని చేయడమే ఇందుకు కారణమన్నారు. కొత్తగా చేరిన సభ్యులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఏప్రిల్‌లో సిల్వర్‌జూబ్లీ వేడుకలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డాక్టర్ సవితా రాణి, కార్యదర్శి సిద్దయ్య, జాయింట్‌కార్యదర్శి దయానంద్, కోశాధికారి శివప్రసన్న, సభ్యులు వీరేశం, సుధాకర్, రమణారెడ్డి, ప్రిన్సిపల్ జ్యోతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీని విస్తరించాలి


మాట్లాడుతున్న ముడుపు యాదిరెడ్డి

సుభాష్‌నగర్: గ్రామగ్రామానా విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ)ను విస్తరించేందుకు ప్రతి కార్యకర్త సమయం ఇవ్వాలని తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి ముడుపు యాదిరెడ్డి పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ ఇందూరు జిల్లా విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ముడుపు యాదిరెడ్డి మాట్లాడుతూ.. రామమందిర నిర్మాణం కోసం 500 ఏళ్ల సుదీర్ఘపోరాటం చేశామని గుర్తుచేశారు. వీహెచ్‌పీ ప్రతి గ్రామంలో విస్తరిస్తే ఇలాంటి ఉద్యమాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. విశ్వహిందూ పరిషత్ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. అప్పుడే హిందూ సమాజం ఏది అనుకుంటే అది నెరవేరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ఠాకూర్, జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, ఉపాధ్యక్షుడు రెబ్బ ఆనంద్, సహ కార్యదర్శి ధాత్రిక రమేశ్, నాయకులు అరుణ్‌రెడ్డి, నాంపల్లి శేఖర్, మహేంద్ర వర్మ, నిఖిల్, అక్షయ్, మురళీ, సతీశ్, గంగా చరణ్, అఖిల్, సురేశ్, ప్రేమ్, భరత్, చరణ్, సాగర్, అభి, సాయి, వీహెచ్‌పీ జిల్లా, ప్రఖండ స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌నగర్ షిర్డీసాయి నగర్ పంచముఖి మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హరిదాసు సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కులచారి సంతోష్, కోశాధికారిగా యలమల శంకర్ ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని సంఘం సభ్యులు సన్మానించారు. మాజీ అధ్యక్షకార్యదర్శులు లడ్డు శంకర్, వైశాక్షి సంతోష్‌తోపాటు సభ్యులు ఆకుల శ్రీశైలం, సాంబార్ మోహన్, బొబ్బిలి కిషన్, మారుతి, ఉప్పు సంతోష్, దారం పోతన్న పాల్గొన్నారు.

నేడు కళోత్సవం

డిచ్‌పల్లి: తెలంగాణ సాంస్కృతిక కళాసంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఘన్‌పూర్‌లో కళాకారుల కళోత్సవం వేడుకలను సోమవారం నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా అధ్యక్షుడు దెగావత్ గణేశ్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘన్‌పూర్ కళ్యాణ మండపంలో సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు పాట రాజశ్రీ సభాక్షత వహిస్తారని, ముఖ్యఅతిథిగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి హాజరవుతారని తెలిపారు. కళాకారుల ఆట, పాట, మాట, ధూంధాం కార్యక్రమాలు ఉంటాయన్నారు. కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

టీడీపీ అర్బన్ కమిటీ ప్రమాణస్వీకారం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ అర్బన్ టీడీపీ కమిటీ సభ్యులు నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెంజర్ల సురేశ్ అధ్యతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో పార్టీ బలోపేతానికి కమిటీ కృషి చేయాలన్నారు. నాయకులు ఎండీ రఫీక్‌ఖాన్, మల్లారెడ్డి, కన్వీనర్లు కోయె డి నర్సింలుగౌడ్, కల్లెడ గంగాధర్, పట్టణ నాయకులు లవంగ రాజు, గంగోని రాజేశ్వర్, నవాతే నర్సయ్య, లక్ష్మీయాదవ్, రామకృష్ణారెడ్డి, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	64,450	వెండి (కిలో)	75,500
22 క్యారెట్స్	59,430	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సిడ్	180
	(కిలోకు)	లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	50	గాజరుగడ్డ	45	60
బెండకాయ	60	80	పచ్చిమిర్చి	40	70
బీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	45	60	ఆలుగడ్డ	15	30
జిర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	60	80	గోబిపువ్వు	20	40
వంకాయ	25	50	బీట్‌రూట్	25	50
పాలకూర	10	20	కరివేపాకు	60	80
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	30	50
పుదీనా	40	60	చిక్కుడుకాయ	30	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	అంబాజీపేట మ్యారేజి బ్యాండు (తెలుగు) - 10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	ధీర (తెలుగు) 10.45, 7.20, గేమ్ ఆన్ (తెలుగు) 1.25, హ్యాపీ ఎండింగ్ (తెలుగు) 4.30, బూట్‌కట్ బాలరాజు (తెలుగు) 10.20
స్క్రీన్-3	హనుమాన్ (తెలుగు) - 1.30, 4.30, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	అంబాజీపేట మ్యారేజి బ్యాండు (తెలుగు) - 12.20, 6.50, ఫైటర్ (హిందీ) -3డీ- 3.15, 9.45
స్క్రీన్-2	హనుమాన్(హిందీ) -3.20, 6.40, 10.00, ఫైటర్ (హిందీ) -3డీ- 11.15
స్క్రీన్-3	ఆర్గిలీ (ఇంగ్లిష్) - 11.00, 7.45, గేమ్ ఆన్ (తెలుగు) 2.05, అంబాజీపేట మ్యారేజి బ్యాండు (తెలుగు)-10.40
స్క్రీన్-4	కిస్మత్ (తెలుగు) 10.10, 7.15, బూట్‌కట్ బాలరాజు (తెలుగు) - 1.00 హ్యాపీ ఎండింగ్ (తెలుగు) - 4.05, ధీర (తెలుగు) - 10.05
దేవి	హనుమాన్ (తెలుగు)
నటరాజ్	కిస్మత్ (తెలుగు)
లలితామహల్	గుంటూరు కారం (తెలుగు)
విజయ్	అంబాజీపేట మ్యారేజి బ్యాండు (తెలుగు)

క్లుప్తంగా

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు



ధర్పల్లి: ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కేసు నమోదు చేయడంతోపాటు జరిమానా విధిస్తామని ఎస్సై వంశీకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంబర్ ప్లేట్‌లేని వాహనాలను వినియోగించి చైన్ స్నాచింగ్, ఇతర నేరాలకు పాల్పడే అవకాశం ఉందని ఎస్సై అన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినా, మద్యం సేవించి డ్రైవింగ్ చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు.

డీఏ విడుదల చేయాలి



నిజామాబాద్‌నాగారం: రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ డీఏను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కే.రామ్మోహన్‌రావు అన్నారు. నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అనుమతించాలన్నారు. ఫిట్‌మెంట్ 30% ఇవ్వాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 10వ తేదీన పెన్షనర్ల కుటుంబ సమ్మేళనాన్ని నిర్వహించాలని తీర్మానించారు. సమ్మేళనానికి ప్రముఖ సామాజిక సేవా కార్యకర్త దేవి, కామారెడ్డి పోలీసు సూపరింటెండెంట్ సింధుశర్మ హాజరవుతారన్నారు. గౌరవ అధ్యక్షుడు శాస్త్రుల దత్తాద్రిరావు, జిల్లా కార్యదర్శి ఈవీఎల్ నారాయణ, జిల్లా కోశాధికారి, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు సన్మానం



సుభాష్‌నగర్: అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణను పద్మశాలీ సంఘం గౌతమ బుద్ధ వీధి తర్ప-16 నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పద్మశాలీ సంఘం అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని అన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నూతన అధ్యక్షుడు అవధూత రాములు, కార్యదర్శి సబ్బని రవి, ఉపాధ్యక్షుడు పెంటి దుర్గాదాస్, సహాయ కార్యదర్శులు బొద్దుల రామకృష్ణ, వల్లకాటి ప్రణీత్, గంజి రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



సిరికొండ: జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో సిరికొండ సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబురాలు-2023లో భాగంగా నిర్వహించిన టెస్ట్ ప్రైవేటు పాఠశాలల విభాగంలో భార్గవ్‌రెడ్డి, యశస్విని, కృతిక ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులకు జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, జేవీవీ జిల్లా ఇన్‌చార్జి చెలిమెల రాజేశ్వర్ ప్రశంసాపత్రాలతోపాటు బహుమతులు అందజేసినట్లు ప్రిన్సిపల్ నర్సయ్య తెలిపారు. ఉపాధ్యాయులు సతీశ్, మోహన్, నరేశ్ పాల్గొన్నారు.

తెలుగు వెలుగు చంద్రశేఖర్‌కు సన్మానం



నిజామాబాద్ సిటీ: సాంస్కృతిక రంగంలో 44 ఏళ్లుగా సేవలందిస్తున్న తెలుగు వెలుగు వ్యవస్థాపకుడు చంద్రశేఖర్‌ను ఆదిభట్ల హరికథ కళావేదిక సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక గీతా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిభట్ల హరికథ కళావేదిక వ్యవస్థాపకుడు చిరంజీవాచార్యులు, ప్రముఖ కవి వీపీ చందన్‌రావు చంద్రశేఖర్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

కరీంనగర్ అసెంబ్లీ ప్రభారీగా అడ్లూరి

బోధన్‌టౌన్(బోధన్): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడ్లూరి శ్రీనివాస్‌ను కరీంనగర్ అసెంబ్లీ ప్రభారిగా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నియమించినట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. కరీంనగర్ అసెంబ్లీ ప్రభారిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడికి, జిల్లా బాధ్యులకు అడ్లూరి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్తం

మోడల్ బుక్స్ పంపిణీ

జక్రాన్‌పల్లి: మండలంలోని నల్లగుట్ట నడిమితండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురుకుల ఎంట్రన్స్ టెస్ట్ మోడల్ పేపర్స్, పుస్తకాలను స్వేరోస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాయి ఆదివారం పంపిణీ చేశారు. స్వేరో నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు సంబంధించిన సబ్జెక్టు పుస్తకాలతోపాటు మోడల్ పేపర్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సాయన్న, స్వేరోస్ సభ్యులు సాగర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని డీ-3 సెక్షన్(దుబ్బ) పరిధిలో 11 కేవీ ఫీడర్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం ఏర్పడుతుందని టౌన్-2 ఏడీఈ తోట రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11గంటలకు గిరిరాజ్ కాలేజ్, గౌతమ్‌నగర్, జన్మభూమి రోడ్, నల్ల పోచమ్మ ఆలయం ప్రాంతాలు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బోరుబావి తవ్వకం



సిరికొండ: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ శైవక్షేత్రం లొంకలో సిరికొండకు చెందిన బోర్‌వెల్స్ వ్యాపారి రాజుల గంగాధర్ సొంత ఖర్చుతో బోరు తవ్వించినట్లు ఆలయ అన్నసత్రం కమిటీ సభ్యులు తెలిపారు. అన్నసత్రం షెడ్డు వద్ద బోరు వేయించగా, ఆదివారం మోటారు ఏర్పాటు చేసి ప్రారంభించారు.

కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజారెడ్డి, ఉపసర్పంచ్ రామకృష్ణ, జె గంగాధర్, మహేశ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

'మనశ్శాంతి కోవెల' నవల ఆవిష్కరణ



నిజామాబాద్ సిటీ: డాక్టర్ మద్దుకూరి సాయిబాబు రచించిన 'మనశ్శాంతి కోవెల' సాంఘిక నవల ఆవిష్కరణ సభను హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ మాజీ కార్యదర్శి చిరంజీవులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాయిబాబును సమాజ సేవచేసే విధంగా తీర్చిదిద్దిన ఆయన తల్లిదండ్రులు ధన్యజీవులన్నారు. 'సాహిత్యం – మానవత్వం' అనే అంశంపై తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం కీలకోపన్యాసం చేశారు. హరిదా రచయితల జిల్లా సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్, సీనియర్ న్యాయవాది గోపాల్‌శర్మ, కవయిత్రి డాక్టర్ అమృతలత, హరిదా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు, తెయూ ఆచార్యులు త్రివేణి, తిరుమల శ్రీనివాస్‌ఆర్య, కంకణాల రాజేశ్వర్, దారం గంగాధర్, సుమీల శర్మ, లక్ష్మి, తొగర్ల సురేశ్, వరలక్ష్మి, మండల సుధ, హరిప్రియ పాల్గొన్నారు.